క్లుప్తంగా

20న సర్వసభ్య సమావేశం

దొరవారిసత్రం: మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 20న స్థానిక ఎంపీపీ దువ్వూరు సుజాతమ్మ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ గోవర్ధన తెలిపారు. ఈ సమావేశంలో శాఖల వారీగా జరిగిన అభివృద్ధిపై సమీక్షిస్తామన్నారు. అంతేకాకుండా మండల ప్రజా పరిషత్ నిధులతో చేపట్టాల్సిన పనులపై చర్చిస్తామని ఆయన తెలియజేశారు.

కండలేరులో 53.478 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో గురువారం నాటికి 53.478 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 720, లోలెవల్ కాలువకు 150, హైలెవల్ కాలువకు 190, మొదటి బ్రాంచ్ కాలువకు 70 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

రైతులకు గుర్తింపు సంఖ్య



మాట్లాడుతున్న ఏఓ హైమావతి

సైదాపురం: ప్రతి రైతుకు ప్రత్యేక గుర్తింపు సంఖ్యను ఇవ్వనున్నట్లు మండల వ్యవసాయాధికారి పి.హైమావతి తెలిపారు. మండలంలోని వేములచేడు రైతు సేవా కేంద్రాన్ని గురువారం తనిఖీ చేశారు. రైతులు వారి ఆధార్‌కార్డు, ఆధార్‌కు అనుసంధానమైన ఫోన్ నెంబర్, పాస్‌బుక్ తీసుకుని రైతుసేవా కేంద్రంలో వీఏఏ ద్వారా రిజిస్టర్ చేసుకోవాలన్నారు.

18న శ్రీలక్ష్మీనరసింహునికి చందనాలంకరణ

రాపూరు: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని శ్రీపెనుశిల లక్ష్మీనరసింహస్వామి మూలమూర్తి ఈ నెల18న చందనాలంకరణలో దర్శనమివ్వనున్నట్లు దేవస్థానం అధికారులు తెలిపారు. ఆ రోజు స్వాతి స్వామివారి జన్మనక్షత్రం కావడంతో స్వామివారికి ఉదయం 4 గంటలకు తిరుప్పావై, 9గంటలకు శాంతిహోమం, 10 గంటలకు కల్యాణం, రాత్రి 7 గంటలకు బంగారు గరుడసేవ నిర్వహించనున్నట్లు తెలిపారు.

చెట్లు నరికివేతకు యత్నం



నరికేసిన చింత చెట్ల కొమ్మలు

చిల్లకూరు: మండలంలోని ముత్యాలపాడు గ్రామంలో భూమి విషయమై ఇరువర్గాల మధ్య తలెత్తిన వివాదంతో ఒక వర్గం కోర్టును ఆశ్రయించింది. దీంతో ఆ భూమి కోర్టు పరిధిలో ఉండడంతో ఎలాంటి పనులు చేపట్టడం లేదు. అయితే అధికార పార్టీ మద్దతు ఉన్న మరో వర్గానికి చెందిన కొందరు ఆ భూమిలోని ఏళ్ల నాటి చింత చెట్లను గురువారం నరికి వేసేందుకు ప్రయత్నించారు. చెట్ల కొమ్మలు నరికి వేశారు. దీంతో సమస్యను పోలీసులు, రెవెన్యూ, అటవీ శాఖాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అటవీ శాఖాధికారులు మాత్రం స్పందించారు. చెట్ల నరికివేతను నిలిపేయాలని ఆదేశించడంతో వారు వెనుదిరిగారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు పటిష్టమైన చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పౌష్టికాహారంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ మెహబూబి

గూడూరు రూరల్: గర్భిణులు, బాలింతలకు పోషక విలువలపై విస్తృతంగా అవగాహన కల్పించాల్సిన బాధ్యత అంగన్‌వాడీ సిబ్బందిపై ఉందని సీడీపీఓ మెహబూబి అన్నారు. గూడూరు పట్టణంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. ఉపాధ్యాయినులు, మహిళా పోలీసులు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీసిటీ చొరవతో రైల్వేస్టేషన్‌లో పార్కింగ్

తడ: రైల్వే స్టేషన్‌లో టూవీలర్ పార్కింగ్ కోసం రైల్వే శాఖ అనుమతులు మంజూరు చేసింది. తడ ప్రాంతంలో పారిశ్రామిక ప్రగతితో ప్రయాణికుల రద్దీ పెరిగినప్పటికీ ఇక్కడి రైల్వే స్టేషన్‌లో టూవీలర్ పార్కింగ్ లేదు. దీంతో ప్రయాణికులు ఎక్కడ పడితే అక్కడ వాహనాలు పార్కింగ్ చేసి వెళుతుండడం దొంగలకు కలిసి వచ్చేది. శ్రీసిటీలోని పరిశ్రమల్లో ఉద్యోగాలు చేసే వారు పెద్ద ఎత్తున బాధితులుగా ఉండడంతో విషయం శ్రీసిటీ యాజమాన్యం దృష్టికి వెళ్లింది. దీనిపై స్పందించిన శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి రైల్వే శాఖ ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకు వెళ్లారు. స్పందించిన రైల్వే అధికారులు అనుమతులు మంజూరు చేశారు. చెన్నైకి చెందిన చారిటబుల్ ట్రస్టు 3 సంవత్సరాలపాటు పార్కింగ్ స్టాండు నిర్వహణకు అనుమతులు పొందింది. ఈ అనుమతులు ఫిబ్రవరి 14 నుంచి అమల్లోకి రానున్నాయి.

- వరి రైతులకు దక్కని మద్దతు ధర
- తక్కువ ధరలతో దళారుల దోపిడీ
- ధాన్యం కొనుగోళ్లలో గోల్‌మాల్

ధాన్యం.. దైన్యం



యంత్రాలతో ముమ్మరంగా వరికోతలు



వరి ధాన్యం ఆరబెడుతున్న కూలీలు

సంపద సృష్టిస్తాం... తడిసిన, మొలకలొచ్చిన నాణ్యత లేని ధాన్యాన్ని సైతం కొనుగోలు చేసి అన్నదాతలకు మద్దతు ధర ఇస్తామన్నారు... ఎక్కడ బాబూ అంటూ వరి రైతులు గుండెలు బాదుకుంటున్నారు. పలుచోట్ల కూటమి నాయకులను సైతం మద్దతు ధరపై ప్రశ్నిస్తున్నారు. సమృద్ధిగా కురిసిన వర్షాలతో ఈ ఏడాది వరిసాగు ముమ్మరంగా చేపట్టారు. వరదల తాకిడితో పలు చోట్ల వరి పైరు దెబ్బ తినింది. ఆరుగాలాలు కష్టపడి పండించిన వరిపైర్లు కోత దశకు రావడంతో ప్రస్తుతం ఇక్కడి రైతులు ముమ్మరంగా వరికోత పనులు చేస్తున్నారు. రేయింబవళ్లు వ్యవసాయ పొలాలకే అంకితమై తీవ్రంగా శ్రమించి పండించిన ధాన్యానికి మద్దతు ధర లేక విక్రయాలు కరువై అల్లాడుతున్నారు. చివరకు దళారుల దోపిడీకి గురై అన్నదాతలు మోసపోతున్నారు. మరి కొందరు గిట్టుబాటు ధర లేకపోవడంతో రోడ్లుపై, కల్లాంలో ధాన్యం ఆరబెడుతున్నారు. –పెళ్లకూరు

రబీ సీజన్‌లో మండలంలో మొత్తం 4756 హెక్టార్లు మేర వరి సాగు చేశారు. ఈ ఏడాది కురిసిన భారీ వర్షాలతో పలు ప్రాంతాల్లో వరిపైర్లు దెబ్బతిన్నాయి.పెళ్లకూరు, చెంబేడు, చిల్లకూరు, పునబాక, నెలబల్లి, కలవకూరు, చావాలి, నందిమాల తదితర గ్రామాల్లో వరికోతలు జోరుగా సాగుతున్నాయి. అయితే రైతులు చెమటోడ్చి పండించిన ధాన్యానికి మద్దతు ధర కల్పించకుండా దళారులు దోచుకుంటున్నారు. రైతులకు మద్దతు ధర కల్పించి ఆదుకోవాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రం నిరుపయోగంగా ఉంది. రైతుల నుండి గింజ కొంటే ఒట్టు అనే చందాన అధికారులు వ్యవహరిస్తున్నారు. పెట్టుబడి కోసం చేసిన అప్పులకు వడ్డీలు పెరిగిపోతుండడంతో వరి కల్లాల్లోనే తక్కువ ధరలకు ధాన్యం దళారులకు విక్రయించేస్తున్నారు.

గిట్టుబాటు ధర కరువు

గిట్టుబాటు ధర కల్పించి, ధాన్యం కొనేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రం నుండి ఇప్పటి వరకు ఒక్కగింజ కూడా కొనలేదు. దీంతో పెళ్లకూరు, అక్కగారిపేట గ్రామాల్లో ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రాలు అలంకార ప్రాయంగా ఉన్నాయి. దళారులు ధాన్యానికి మార్కెట్ ధర లేదంటూ రైతులను నిలువు దోపిడీ చేస్తున్నా ఇక్కడి అధికారులు పట్టించుకోవడం లేదు. ఎంటీయూ–1010, ఎన్ఎల్ఆర్–145, ఆర్ఎన్ఆర్ఎం–7, ఎన్ఎల్ఆర్ 34449, బీపీటీ–5240, ఎన్ఎల్ఆర్–33358, ఎన్ఎల్ఆర్ 33057 ధాన్యాలను గ్రేడ్–ఏ రకంగా గుర్తించి క్వింటాలు రూ.2320 మద్దతు ధర ప్రకటించారు. ఎంటీయూ–1001, సీఆర్–1009, ఎన్ఎల్ఆర్–34242, ఏడీటీ–37, ఎన్ఎల్ఆర్–286000 రకాలను సాధారణ రకంగా గుర్తించి క్వింటాల్ రూ.2300 మద్దతు ధర ప్రకటించారు. కానీ ఇక్కడి అధికారులు దళారులతో కుమ్మక్కై ధాన్యం కొనుగోళ్లు చేయడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. దళారులు రైతుల నుండి కర్రల తూకాలతో 75 కేజీలు ధాన్యం బస్తా కొనుగోలు చేసి మూడు కేజీల నెమ్ము, ఒక కేజీ గోతాం కింద తరుగు తీసివేసి కేవలం 69 కేజీలకు మాత్రం తక్కువ ధర చెల్లిస్తూ రైతులను దోచుకుంటున్నారు.

మద్దతు ధరతో కొనుగోలు చేయాలి



కష్టపడి పండించిన ధాన్యం దళారులు స్వాహా చేయకుండా అధికారులు మద్దతు ధరతో కొనుగోలు చేయాలి. కష్టపడి పండించిన ధాన్యం తక్కువ ధరలకే విక్రయించడంతో నష్టాలు వస్తున్నాయి.
– పరంధామనాయుడు, లక్ష్మీనాయుడుకండ్రిగ

దళారులకే విక్రయిస్తున్నాం



రైతులు పండించిన ధాన్యం అధికారులు కొనుగోలు చేయడం లేదు. గతి లేక చివరకు దళారులకే విక్రయించేస్తున్నాం. కనీసం ధాన్యం ఆరబెట్టుకోవడానికి టార్పాలిన్ పట్టలు కూడా పంపిణీ చేయడం లేదు. – సుబ్రమణ్యంనాయుడు, యాలకారికండ్రిగ

కొనుగోలు చేస్తున్నాం

మండలంలోని అన్నీ ప్రాంతాల్లో వరికోతలు ముమ్మరంగా చేస్తున్నారు. నిబంధనల ప్రకారం మద్దతు ధరతో కొను గోలు చేస్తున్నాం. రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి. – ప్రవీణ, ఏఓ, పెళ్లకూరు

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ఆత్మకూరు డీఎస్పీ

సైదాపురం: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆత్మకూరు డీఎస్పీ వేణుగోపాల్ కోరారు. మండలంలోని ఊటుకూరు గ్రామంలో బుధవారం రాత్రి పల్లె నిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. గురువారం ఉదయం ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల విషయంలో కఠినమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. వేసవి కాలంలో రాత్రిళ్లు ఇళ్లకు తాళాలు వేసి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట సీఐ చిన సత్యనారాయణ, ఎస్ఐ క్రాంతికుమార్ ఉన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

చిట్టమూరు: మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ మనోహర్‌గౌడ్ గురువారం తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఎంపీపీ సన్నారెడ్డి విజయలక్ష్మీ ఆధ్వర్యంలో నిర్వహించే సర్వసభ్య సమావేశంలో 15 అంశాలకు సంబంధించిన సమస్యలపై చర్చ ఉంటుందన్నారు. ఈ సమావేశానికి అన్ని శాఖల మండల స్థాయి అధికారులు ఆయా శాఖలకు చెందిన నివేదికలను తీసుకుని తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

అధినేతతో నేదురుమల్లి భేటీ



వెంకటగిరి(సైదాపురం): మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వైఎస్ఆర్ సీపీ వెంకటగిరి సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి గురువారం తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వెంకటగిరి నియోజకవర్గంలో వైఎస్ఆర్ సీపీ బలోపేతంపై చర్చించారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి



కొత్తగుంటలో విద్యార్థుల మానవహారం

చిట్టమూరు: రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు కృషి చేయాలని టీఎంఆర్ పాఠశాల కరస్పాండెంట్ మనోహర్‌రెడ్డి పిలుపునిచ్చారు. చిట్టమూరు ఎస్ఐ చినబలరామయ్య ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులు గురువారం మండలంలోని కొత్తగుంట గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం కూడలి ప్రాంతంలో మానవ హారంగా రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రతిజ్ఞ చేశారు. మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ మద్యం మత్తులో వాహనాలు నడపకూడదని తెలిపారు. ఏఎస్ఐ నాగేశ్వరరావు, టీఎంఆర్ ప్రిన్సిపల్ రహంతుల్లా, డైరెక్టర్ విజయలక్ష్మీ, మేనేజర్ శీనయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దుస్థితిలో మొలగనూరు రోడ్డు



మొలగనూరు వద్ద అధ్వానంగా మారిన రోడ్డు

వాకాడు: మొలగనూరు మీదుగా తూపిలిపాళెం వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డు అధ్వానంగా తయారైందని మొలగనూరు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామస్తులు గురువారం మాట్లాడుతూ కోట నుంచి మొలగనూరు మీదుగా తూపిలిపాళెం వెళ్లే రోడ్డు దుస్థితిలో ఉందన్నారు. చిల్లకూరు మండలం అంకులపాటూరు నుంచి కోట మండలం మీదుగా దాదాపు 14 గ్రామాలను కులుపుతూ తూపిలిపాళెం వరకు 22 కిలోమీటర్లు వరకు రోడ్డు పనులు చేసేందుకు ఇటీవల ఉన్న రోడ్డును ధ్వంసం చేశారన్నారు. దాదాపు నెల రోజులైనా కనీసం తాత్కాలిక మరమ్మతులు కూడా చేయలేదని తెలిపారు.

ప్రారంభానికి నోచుకోని సచివాలయం



గూడలిలో ప్రారంభానికి నోచుకోని సచివాలయ భవనం



ఇరుకైన గదిలో సచివాలయం

కోట: సచివాలయాల కోసం ఆధునిక హంగులతో నూతన భవనాలు నిర్మించారు. కొన్ని భవనాలు పూర్తికాగా మరికొన్ని నిర్మాణ దశలోనే ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ భవనాలను మరుగున పడేసింది. ఎన్నికలకు ముందు పూర్తయిన భవనాలను కూడా ఇంత వరకు ప్రారంభించలేదు. మండల పరిధిలోని గూడలిలో రూ.43 లక్షలతో సచివాలయ భవనాన్ని నిర్మించారు. భవనాన్ని పూర్తి చేసి రంగులతో అలంకరించారు. ఇంతలోనే ఎన్నికల కోడ్ రావడంతో ప్రారంభానికి నోచుకోలేదు. విధిలేని పరిస్థితిల్లో ఇరుకైన చిన్న గదిలో సచివాలయం నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వీలైనంత త్వరగా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని గూడలి గ్రామస్తులు కోరుతున్నారు. ఎంపీడీఓ వేణును వివరణ కోరగా ఉన్నతాధికారులే నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు.

22 వరకు న్యాయ వారోత్సవాలు

శ్రీకాళహస్తి: నేషనల్ లీగల్ సర్వీస్ అథారిటీ, జిల్లా జడ్జి ఆదేశాల మేరకు ఈ నెల 22వ తేదీ వరకు న్యాయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు న్యాయ సేవా సంఘం సభ్యులు తెలిపారు. బుధవారం నుంచి వీటిని ప్రారంభించినట్లు చెప్పారు. ఇందులో భాగంగా శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని ప్రత్యేక ప్రతిభావంతులు, బుద్ధిమాంద్యులను గుర్తించి, వారి స్థితిగతులు, సమస్యలను తెలుసుకుని జిల్లా జడ్జి దృష్టికి తీసుకెళ్తామన్నారు. గురువారం స్థానిక తుపాన్ సెంటర్లో ఐదేళ్ల బుద్ధిమాంద్యం బాలుడిని గుర్తించినట్టు చెప్పారు. న్యాయవాదులు గుమ్మల రాజేశ్వరరావు, గరికపాటి రమేష్ బాబు, శ్రీరాం, కోర్టు సిబ్బంది, పారా లీగల్ వలంటీర్లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు

ఇంకుడు గుంతలు త్వరగా పూర్తి చేయాలి



సమీక్షిస్తున్న క్వాలిటీ కంట్రోల్ అధికారి సతీష్‌బాబు

చిల్లకూరు: ప్రభుత్వం భూగర్భ జలాల పెంపు కోసం చేపడుతున్న ఇంకుడు గుంతలను త్వరగా పూర్తి చేయాలని మూడు జిల్లాల క్వాలిటీ కంట్రోల్ అధికారి సతీష్‌బాబు సూచించారు. మండలంలోని ఉపాధి కార్యాలయంలో గురువారం ఆయన సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని 30 పంచాయతీలలో 2 వేల వరకు ఇంకుడు గుంతలు నిర్మించాల్సి ఉందని తెలిపారు. పనులు పూర్తి అయిన తరువాత నాణ్యతను పరిశీలిస్తే ఎక్కడైనా అవకతవకలు బయట పడితే సంబంధిత సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉపాధి ఏపీఓ గిరిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆటపాటలతో కూడిన విద్య అవసరం



మాట్లాడుతున్న సీడీపీఓ ఉమామహేశ్వరి

పెళ్లకూరు: అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్య, మంచి పోషక విలువలు ఉన్న ఆహారం అందిస్తున్నట్లు సీడీపీఓ ఉమామహేశ్వరి పేర్కొన్నారు. గురువారం పెళ్లకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన పోషణ్ బీ పడాయి బీ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు మూడు రోజులు ప్రత్యేక శిక్షణ అందిస్తున్నామన్నారు. ఎంఈఓ శంకరయ్య, సూపర్‌వైజర్ సాయిలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ఆడ పిల్లలకు చదువు ముఖ్యం



అంగన్‌వాడీ కార్యకర్తలకు పుస్తకాల పంపిణీ

చిల్లకూరు: పుట్టిన ప్రతి ఆడబిడ్డకు చదువు ఎంతో ముఖ్యమని ఐసీడీఎస్ అధికారులు సూచించారు. మండల కేంద్రమైన చిల్లకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషణబీ– పడాయి బీ అనే కార్యక్రమంలో భాగంగా తొలి రోజు చిన్న పిల్లలకు పౌష్టికాహారం ఎలా అందించాలనే విషయంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ నాగిశెట్టి రేణుక మాట్లాడుతూ పౌష్టికాహారం తీసుకోవడంపై అవగాహన కల్పించాలన్నారు. మరో సూపర్‌వైజర్ శివజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో షబేబరాత్

నాయుడుపేట టౌన్: ముస్లింలు వారి పెద్దలను స్మరించుకుంటూ ఎంతో భక్తిశ్రద్ధలతో చేపట్టే షబేబరాత్ ప్రార్థనలను గురువారం నిర్వహించారు. పట్టణంలోని జామియా మసీదులో గురువారం రాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజామున వరకు ముస్లింలు ప్రత్యేక నమాజు చదువుతూ జాగారాలు చేశారు. పట్టణంలోని అమీర్‌షావలీ మసీదు, పాత బస్టాండు వద్ద ఉన్న నూర్ మసీదు, అమరాగార్డెన్ వీధిలో మక్కా మసీదు, హజీజా పురం, మునిరత్నం నగర్, ఎల్ఏ సాగరం పాత, కొత్త బీబీకాలనీల వద్ద ఉన్న మసీదులలో ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. తెల్లవారు జామున ముస్లిం శ్మశాన వాటిక వద్ద పెద్దలను స్మరించుకున్నారు.

ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించాలి



వేణుంబాకంలో రైతులతో మాట్లాడుతున్న రైతు కూలీ సంఘం నాయకులు

దొరవారిసత్రం: రాష్ట్ర ప్రభుత్వం ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించాలని రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమణయ్య, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సుబ్బరాయుడు డిమాండ్ చేశారు. గురువారం దొరవారిసత్రం మండలంలోని వేణుంబాకం, వెదురుపట్టు, వెదురుపట్టురాజుపాళెం తదితర గ్రామాల్లో రైతు కూలీ సంఘం నాయకులు కల్లాల వద్ద రైతులను కలిసి మాట్లాడారు. దళారులు ప్రస్తుతం 75 కేజీ ధాన్యం బస్తాను రూ.1650కి కొంటున్నారని తెలిపారు. ఇదే బస్తా గత ఏడాది రూ.2200 వరకు ధర ఉందని తెలిపారు. ప్రభుత్వం బస్తా ధాన్యం రూ.2500 కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలన్నారు. రైతు కూలీ సంఘం నాయకుడు రాజశేఖర్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోండి



మాట్లాడుతున్న డాక్టర్ రోహిణి

గూడూరు రూరల్: ప్రజలు ఉచిత మెడికల్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని ఆంధ్ర మహిళా మండలి గౌరవాధ్యక్షురాలు, ప్రముఖ వైద్యులు డాక్టర్ రోహిణి కోరారు. గూడూరు పట్టణంలోని షిరిడీ సాయినగర్‌లో ఉన్న సాయిబాబా మందిరంలో గురువారం లక్ష్మీ శంకర్ ఆయుర్వేద ఆసుపత్రి 4వ వార్షికోత్సవం సందర్భంగా ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ రోహిణి మాట్లాడుతూ ఆయుర్వేద చికిత్స ద్వారా అతి తక్కువ సైడ్ ఎఫెక్ట్స్ ఉండవని తెలిపారు. ప్రజలు ఆయుర్వేద చికిత్సపై ఆసక్తి చూపుతున్నారన్నారు. ఈ మెడికల్ క్యాంపులో పాల్గొన్న డాక్టర్ శంకర్ ఎంతో అనుభవం కలిగిన వైద్యులని స్వయంగా తెలుసుకున్నట్లు తెలిపారు. అనంతరం ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులను ఉచితంగా అందజేశారు.

మూడు గంటలకే సచివాలయం మూత



మధ్యాహ్నం మూడు గంటలకే తాళం వేసి ఉన్న సచివాలయం

చిల్లకూరు: సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించక పోతుండడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇలాంటి ఘటనే చిల్లకూరు మండలం ముత్యాలపాడు గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. ఉదయం 12 గంటలకు డీఎల్‌డీఓ వాణి పలు సచివాలయాలను తనిఖీ చేశారు. ఇందులో భాగంగానే ముత్యాలపాడు సచివాలయాన్ని కూడా తనిఖీ చేశారు. పంచాయతీ కార్యదర్శి రమాదేవితోపాటు సిబ్బందికి సూచనలు ఇచ్చి వెనుదిరిగారు. ఆమె వెనుకనే ఏడుగురు సచివాలయ సిబ్బంది కార్యాలయానికి తాళాలు వేసుకుని వెళ్లిపోయారు. మధ్యాహ్నం మూడు గంటలకు ఓ వ్యక్తి పని మీద వచ్చాడు. అయితే సచివాలయానికి తాళం వేసి ఉండడంతో వెనుదిరిగాడు. దీనిపై డీఎల్‌డీఓను వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆమె సమావేశంలో ఉండడంతో మాట్లాడలేదు. ఈఓపీఆర్‌డీ సిరాజ్‌ను వివరణ కోరగా సిబ్బంది వెళ్లిపోయిన విషయం తెలిసిందని, దీనిపై ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు.

ముగ్గురికి ఉపకార వేతనాలు



షేక్ రహమాన్, కార్తీక్, షేక్ ఖాజానబి

కలువాయి: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్ఎంఎంఎస్) ప్రవేశ పరీక్షలో కలువాయి మండలం చీపినాపి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. పాఠశాలకు చెందిన షేక్ ఖాజానబి, కార్తీక్, షేక్ రహమాన్ ఈ పథకం కింద ఉపకార వేతనాలకు ఎంపికైనట్లు హెచ్ఎం జనార్దన రెడ్డి గురువారం తెలిపారు. ఈ ఉపకార వేతనాలకు ఎంపికైన విద్యార్థులకు ప్రతి ఏటా రూ.12,000 చొప్పున నాలుగేళ్లపాటు వారి ఖాతాల్లోకి జమ చేస్తారని తెలిపారు. వీరిని ఎస్ఎంసీ సభ్యులు, ఉపాధ్యాయులు అభినందించారు.

చీలిన టీడీపీ

- సూళ్లూరుపేటలో రెండు వర్గాల కార్యాలయాలు
- శ్రీచెంగాళమ్మ బోర్డు చైర్మన్ పదవి కోసం హోరాహోరీ



సుధాకర్‌రెడ్డి భవనంలో టీడీపీ రెండో కార్యాలయం

సూళ్లూరుపేట: శ్రీచెంగాళమ్మ పరమేశ్వరి ఆలయ చైర్మన్ పదవి విషయంలో టీడీపీ రెండుగా చీలింది. సూళ్లూరుపేట పట్టణంలో రెండు పార్టీ కార్యాలయాలు ఏర్పడ్డాయి. బస్టాండ్‌కు సమీపంలో వేనాటివారికి చెందిన పార్టీ కార్యాలయం చాన్నాళ్ల నడుస్తోంది. ఇప్పుడు కొత్తగా పట్టణంలోని కచ్చేరీవీధిలో టీడీపీ అధికార పార్టీ ప్రతినిధి తిరుమూరు సుధాకర్ రెడ్డికి చెందిన కృష్ణాలాడ్జిలో మరో పార్టీ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. ఎన్నికల నాటి నుంచే పార్టీలో వివాదాలు ఉన్నాయి. అప్పటి నుంచే కొండేపాటి గంగాప్రసాద్, వేనాటి సతీష్‌రెడ్డి వర్గాల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేంత విబేధాలు ఉన్నాయి. శ్రీచెంగాళమ్మ ఆలయ చైర్మన్ పదవి విషయంలో ఈ వివాదాలు తారస్థాయికి చేరాయి. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ కూడా కొండేపాటి వైపే ఉన్నారు. వేనాటి వారితో కనీసం పలకరింపు కూడా లేకపోవడం విశేషం. శ్రీచెంగాళమ్మ చైర్మన్ గిరీ తనకే వస్తుందని కొండేపాటి వర్గానికి చెందిన సుధాకర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేస్తున్నారు. అలాగే వేనాటి వారు కూడా ధీమాగానే ఉన్నారు. వేనాటోళ్లకు అనుకూలంగా ఆనం రామనారాయణరెడ్డి దేవదాయ శాఖ మంత్రిగా ఉన్నారు కాబట్టి వారికే పదవి వస్తుందని ప్రచారం జోరుగా సాగుతోంది. మొత్తానికి సూళ్లూరుపేట తెలుగు తమ్ముళ్ల రెండుగా విడిపోయి చేస్తున్న రాజకీయం రసకందాయంలో పడినట్టుంది.